క్లుప్తంగా

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



మల్హర్: మండలంలోని తాడిచర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థినులు బోయిని సిరిచందన, పోలోజు వర్ధినిలు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయినట్లు స్కూల్ హెచ్‌ం తిరుపతి తెలిపారు. గురువారం విద్యార్థులను హెచ్ఎం అభినందించారు. ఈ స్కాలర్‌షిప్‌తో ఇంటర్మీడియట్ వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల పొందడం జరుగుతుందన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



కాళేశ్వరం: కాళేశ్వరం యూత్ ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌కి సహకరించిన ప్రతీ ఒక్క క్రీడాకారులకు, క్రికెట్ అభిమానులకు నిర్వాహకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. టోర్నమెంట్‌కు గ్రౌండ్ ఇచ్చి యువతకు సహకరించిన కామిడి శ్రీనివాస్ రెడ్డి, వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, ఆరుట్ల పవన్‌చారి,మాచర్ల అరుణ్‌కుమార్, ఆరుట్ల భాస్కర్‌చారి, శ్రీరాంబట్ల ప్రణయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహన సదస్సు



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు డాక్టర్ నాగరాణి అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 10 నుంచి నేషనల్ డీ వామింగ్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్, ఎంఈఓ కుమారస్వామి తదితరులు ఉన్నారు.

పరామర్శ



మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రాజమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, నాయకులు యాదగిరిరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లుపల్లి గ్రామానికి చెందిన జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు దయ్యాల సదయ్య తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గురువారం ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటగిరి సతీష్‌గౌడ్‌లు రాజయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రఘాడ సానుభూతి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దుంద్ర కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



నరేశ్(ఫైల్)

మొగుళ్లపల్లి: మద్యం మత్తులో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన గుండారపు నరేశ్ (33)గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య భర్తల మధ్య గొడవలు జరగగా భార్య మూడు సంవత్సరాలుగా పుట్టింట్లో ఉండి తిరిగి ఇటీవలే కాపురానికి వచ్చింది. మృతుడు పది రోజులుగా విపరీతంగా మద్యం తాగుతున్నాడు. తన భర్త తాగుడు మూలన ఇంట్లో డబ్బులు లేకుండా అయ్యాయని, పని చేయడానికి పని లేదని భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది మద్యం మత్తులో తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి గుండారపు వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆధార్ కష్టాలు తీరేదెన్నడు..?

- అప్‌డేట్, అనుసంధానం కోసం ప్రజల ఇక్కట్లు
- సేవలకోసం పొరుగు మండలాలకు పరుగులు
- పట్టించుకోని అధికారులు



మూతపడిన ఆధార్ కేంద్రం

రేగొండ: మండలకేంద్రంలోని ఆధార్‌కేంద్రంలో సేవలు నిలిచిపోయాయి. ప్రజల సౌకర్యార్థం నూతన జిల్లాగా జయశంకర్ భూపాలపల్లి రూపకల్పన జరగగా మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో యూఐడీఏఐ సంస్థ తరఫున ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఆధార్ సేవలు నిలిచిపోవడంతో మండలంలోని ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ సేవల కోసం పక్క మండలాలకు వెళుతున్నారు.

అనుసంధానం తప్పనిసరి కావడంతో..

ప్రస్తుతం ప్రతీ చిన్న పనికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి అయింది. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు నిత్యం ప్రజలకు అవసరమైన సేవలు, బ్యాంకు ఖాతాల నుంచి ఐడీ ప్రూఫ్‌ల వరకు ఆధార్‌తోనే పని. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు అందించే ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉండాల్సి ఉంది. స్థానికంగా మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్ర కొన్ని సంవత్సరాలుగా మూసి ఉన్నది. దీంతో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని 39 గ్రామ పంచాయతీల ప్రజలు ఆధార్ అనుసంధానం చేసుకునేందుకు, అప్‌డేట్ కోసం ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి ములుగు, పరకాల, హనుమకొండకు వెళ్లి ఆధార్ సేవలు పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

సేవలు పునరుద్ధరించాలి



కొన్ని సంవత్సరాలుగా రేగొండ మండలకేంద్రంలోని ఆధార్ కేంద్రంలో సేవలు నిలిచిపోయాయి. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పిల్లల బయోమెట్రిక్ కోసం అవస్థలు పడుతున్నాం. ఈ ప్రాంతంలో ఆధార్ సేవలు పనిచేయకపోవడంతో ములుగు, పరకాలకు వెళ్లాల్సి వస్తోంది. వెంటనే ఆధార్ సేవలు పునరుద్ధరించాలి.

-దండెబోయిన ప్రియాంక, గాంధీనగర్

కలెక్టర్‌కు నివేదించాం..



మండలకేంద్రంలోని ఆధార్ సెంటర్ పునరుద్ధరణ కోసం కలెక్టర్‌కు నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే తొందరలోనే ఆధార్ కేంద్రాన్ని పునః ప్రారంభిస్తాం.

-శ్వేత, తహసీల్దార్, రేగొండ

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ

- శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్



తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

భూపాలపల్లి రూరల్: పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్ తెలిపారు. జంగేడు గ్రామ రెవెన్యూ శివారులోని మిరప తోటల్లో ఉద్యాన శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేస్తేనే రోగాలు రాకుండా అరికట్టవచ్చని సూచించారు. మిరప తోట చుట్టూ తప్పనిసరిగా రక్షక పంటగా రెండు వరుసల జొన్న విత్తుకోవాలని తెలిపారు. పంటలో నీలిరంగు, తెలుపు, పసుపు రంగు జిగురు అట్టలు పెట్టడం ద్వారా రసం పీల్చే పురుగులను ఆకర్షించి, నాశనం చేయవచ్చని రైతులకు వివరించారు. వరంగల్ చపాట మిర్చి వచ్చే చీడపీడలను సమగ్రవంతంగా అరికట్టడానికి సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉద్యాన అధికారి సునీల్, ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది, అభ్యుదయ రైతులు గంపల సంజీవ్, వేషాల సాంబయ్య, గుడిపాటి సుధాకర్ రెడ్డి, బానోత్ సమ్మయ్య, బొయిని రవి తదితర రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో నేడు(శుక్రవారం) ఉదయం 8:30 నుంచి ఉదయం 11:00 గంటల వరకు పట్టణంలోని మంజూరునగర్, వెంకటేశ్వర కాలనీ, జీఎంఆర్ వెంచర్, బీసీ కాలనీ, వెంగల్ రావు వెంచర్, కుందూరుపల్లి, మాదవ రావుపల్లిలో అంతరాయం ఉంటుందని భూపాలపల్లి అర్బన్ ఏఈ విశ్వాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 5 ఇంక్లైన్ కమాన్ నుంచి రిలయన్స్ పెట్రోల్ బంక్ వరకు ఉదయం 11:00గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న సభ్యులు

చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి ఇటీవల బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నాడు. దీంతో పాఠశాల పెరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సంగి రవి, కమిటీ సభ్యులు మారెపెల్లి మల్లేశ్, కొలుగూరి సదానందం సుంకరపల్లి భాస్కర్, దండ్రే రమేశ్, దేవేందర్ గురువారం ఘనంగా సన్మానించారు.

సమయస్ఫూర్తి ప్రదర్శించాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

భూపాలపల్లి రూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రజలు సమయస్ఫూర్తిని ప్రదర్శించాలని ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ ఎస్కే బెహ్రా సూచించారు. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో గురువారం ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించిన సందర్భాలలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైన ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు భయాందోళలకు గురికాకుండా సహాయక చర్యలు చేపట్టి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఎస్ఆర్ఎఫ్ బృందాలు నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగరాజు, ఆర్ఐ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

10లీటర్ల గుడుంబా పట్టివేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బెగులూర్ గ్రామానికి చెందిన తాటికొండ వెంకన్న గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. తెలిసిన సమాచారంతో తనిఖీ చేసి 10లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకొని వెకన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

- ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రేగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అన్నారు. గురువారం మండలం కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లాస్టిక్ వాడాకాన్ని నియంత్రించాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేగొండ ఎఎస్ఐ ప్రభాకర్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, దేవేందర్, శ్యామ్‌సురేందర్ రెడ్డి, రంజాన్, సునీత, జ్యోతి, శారద పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తొద్దు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్‌కుమార్



ట్యాంకును పరిశీలిస్తున్న హరీశ్‌కుమార్



జూకల్‌లో ట్యాంకును పరిశీలిస్తున్న డీఈ శ్వేత



భూపాలపల్లి రూరల్: రాంపూర్‌లో..

టేకుమట్ల: రానున్న వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్‌కుమార్ అధికారులకు సూచించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పెద్దంపల్లి, పంగిడిపల్లి, ఆశిరెడ్డిలపల్లి గ్రామాల్లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లు, చేతి పంపులు, ఓపెన్‌వెల్‌లను ఎంపీఓ సురేష్‌తో కలిసి పరిశీలించారు. అలాగే గ్రామ పంచాయతీ రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ పంపు ఆపరేటర్లు నీటి సరఫరాలో ప్రత్యేక పాత్ర పోషిస్తాని తెలిపారు. కావున నిత్యం నీటి వనరుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తూ నీటిని సరఫరా చేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు సరి చేస్తూ నీటిని సరఫరా చేయాలని, లీకేజీల వల్ల నీటి కలుషితం అవుతుంది లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిట్యాల: మండలంలోని ప్రజలు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ డీఈ శ్వేత సంబంధిత అధికారులను కోరారు. గురువారం మండలంలోని జూకల్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్, చేతి పంపులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోయి పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ జయశ్రీ, మిషన్ భగీరథ ఏఈ గీత, పంచాయతీ కార్యదర్శి మహేష్, సిబ్బంది ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: వేసవికాలంలో నీటి ఎద్దడిని నివారించే కార్యచరణలో భాగంగా గురువారం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజుతో పాటు, ఆర్ఎస్‌డబ్ల్యూ ఏఈ ఇస్రాత్, అధికారులు మండలంలోని చికినెపల్లి, రాంపూర్, కమలపూర్ తదితర గ్రామాల్లో సందర్శించారు. తాగునీటి బోర్‌వెల్స్, చేతిపంపులు, మిషన్ భగీరథ పైప్‌లైన్లు పంపుల పనితీరును పరిశీలించారు. రిపేర్లు ఉన్న వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలని ఎంపీడీఓ నాగరాజు కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

కులగణన సర్వేలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

కాటారం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనతో బీసీలో లాభం జరిగింది ఏం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసాల రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనతో కాంగ్రెస్ పార్టీ దేశంలో రాజకీయ లబ్ధిపొందాలనే ఆలోచన చేస్తుందే తప్ప బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్, ఫిలిమ్ సెన్సార్ బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, వేముల లింగయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

టేకుమట్ల: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలోని రామాంజనేయ స్వామి దేవాలయంలో సత్యసాయి ట్రస్టు సభ్యులు రావికంటి ఉషాయాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో మండల కేంద్రంలోని మాడ వీధులగుండా భజన సంకీర్తనల మధ్య ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు వొల్లాల శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మెన్ దాసరి రాజయ్య, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని జిల్లా కాలనీ, టేకులబోరు, మంగవాయి, ముక్కునూరు పాలెం, రామచంద్రాపురం, మొర్రవాని గూడెం, అలుబాక, బర్రె బొంద, ఎదిర గ్రామాల్లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం 800 మంది పేద విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ యజమాన్య సభ్యులు మురళీకృష్ణారెడ్డి, సతీష్, ముర్రం రాజేష్, అంజనేయులు తదితరులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం పేద విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ యజమాన్య సభ్యులు మురళీ రెడ్డి చేతుల మీదుగా 63 మందికి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో కంతి శ్యామ్ నవీన్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణను విజయవంతంగా అమలు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, కాంగ్రెస్ శ్రేణులు మూల శంకర్‌గౌడ్, గడ్డం కొమురయ్య, బుర్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

- మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతంలోని పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని 2/6/2025 6:27:07 PM, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు తాజొద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం తాడిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధుకర్ తాడిచర్ల ఖమ్మంపల్లి మానేరుపై వంతెన నిర్మాణంతో పాటు తాడిచర్ల నుంచి పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాడని తెలిపారు. కిషన్‌రావుపల్లి అటవీ ప్రాతంలో రోడ్డు నిర్మాణానికి సైతం ఫారెస్ట్ అనుమతులు తీసుకవచ్చారని చెప్పారు. గెలిస్తే కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతంలోని రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 14నెలలు కావస్తున్నా ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, మాజీ సర్పంచ్ సుంకరి సత్తయ్య, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన, గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నమనేని మధుసూదన్‌రావు, నారా రమేశ్, నాయకులు రాజేశ్వరరావు, సమ్మయ్య, రమేశ్, కిషన్, శంకర్, వినయ్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్య తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

టేకుమట్ల: మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల హాస్టల్ విద్యార్థి మండలంలోని పండిగిపల్లి గ్రామానికి చెందిన పురాణం సంతోష్ మృతికి వార్డెన్ కారణమని, వెంటనే అతడిపై చర్య తీసుకుని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలన్నారు. విద్యార్థులపై నిత్యం పర్యవేక్షించాల్సిన వార్డెన్ నిర్లక్ష్యంతో విద్యార్థి చలివాగులో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడని మండిపడ్డారు. గతంలో చలివాగులో పడి భర్తను, నేడు బిడ్డను కోల్పోయిన తల్లి తల్లడిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున విద్యార్థి మృతికి కారణమైన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

కళాకారులకు డప్పుల బహూకరణ



కళాకారులకు డప్పులు అందిస్తున్న చంద్రమౌళి

టేకుమట్ల: మండలంలోని డప్పు కళాకారులకు హనుమకొండలోని లావణ్య ఆస్పత్రి డాక్టర్ నవీన్ అతడి తండ్రి వెంకట్రావుపల్లి మాజీ సర్పంచ్ ఏకు మల్లేశ్ జ్ఞాపకార్థం 100 డప్పులను గురువారం బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టనున్న లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి ప్రతీ గ్రామం నుంచి కళాకారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద తిరుపతి, రేనుకుంట్ల సంపత్, మచ్చ శ్రీకాంత్, అక్కల రాజయ్య, భద్రయ్య, కన్నూరి సారయ్య, రేనుకుంట్ల శంకర్, ఇల్లందుల శంకర్, అంబాల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ బీభత్సం

- ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

కాటారం: ఇసుక లారీ డ్రైవర్ అతి వేగం, అజాగ్రత్తతో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలపాలై తన రెండు కాళ్లు కోల్పోవాల్సిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి సమీపంలోని సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన తోట రవి తన కుమారుడిని తీసుకొని మధ్యాహ్నం సమయంలో గారెపల్లిలోని జిరాక్స్ సెంటర్‌కు వచ్చారు. పని పూర్తి చేసుకొని బైక్ స్టార్ట్ చేస్తున్న క్రమంలో మహదేవపూర్ నుంచి భూపాలపల్లి వైపుగా వెళ్తున్న ఇసుక లారీ అతివేగంతో బైక్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై ఉన్న రవి లారీ టైర్‌లలో ఇరుక్కొని కొంత దూరం మేర ఊడ్చుకొని పోయాడు. దీంతో రవి రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. గమనించిన స్థానికులు లారీని వెంబడించి పట్టుకున్నారు. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడు రవిని భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి అనంతరం వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన..

ఇసుక లారీ ఢీ కొని రవి తీవ్రగాయాలపాలైన సంఘటనలో మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కులసంఘాలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపై ఆందోళన చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఇలాకాలో ఇసుక లారీల బీభత్సం జరుగుతున్న నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని విమర్శించారు. సుమారు గంట పాటు ఆందోళన కొనసాగగా ఎస్సై మ్యాక అభినవ్ నిరసనకారులకు నచ్చజెప్పారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, చీమల వంశీ తదితరులు పాల్గొన్నారు.